సంపుటి: 2 | సంచిక: 5
జూలై - ఆగస్టు, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



PROUD TO BE INDIAN

**HAPPY INDEPENDENCE DAY**

*Be a Part of Free India*



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని నామములో స్పర్శ పాఠకులకు వందనములు. గత ఆరునెలలు మనలను క్షేమముగా నడిపించిన దేవదేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాము.

చదువుకొనుచున్న పిల్లలు వారి చదువులలో జయము పొంది, ముందు ఉన్న కోర్సులలో జాయిన్ అవుతూ ఉన్నారు. వారికి ఉన్నత చదువులలో దేవుడు జ్ఞానము, జ్ఞాపకశక్తి ఇచ్చి నడిపించాలని ప్రార్థన చేయుదము. అంత మాత్రమే కాక వారి ఆత్మీయ జ్ఞానము కొరకు కూడా దేవుని వేడుకొనవలసి ఉన్నది.

మనము ప్రార్థించిన విధముగానే దేశములోను, రాష్ట్రములోనూ సుస్థిర ప్రభుత్వములు ఏర్పడ్డాయి. వారు సరియైన నిర్ణయములు తీసుకునే విధంగా ప్రార్థించవలయును. మన దేశము త్వరితగతిని అభివృద్ధి చెంది, ప్రజలందరికి సరియైన జీవనోపాధి దొరుకునట్లుగా దేవుడు సహాయము చేయును గాక !

మన సమాజములో ప్రతి ఇల్లు ఒక ఆధ్యాత్మిక కేంద్రముగా పనిచేసినట్లైతే, చిన్నవయస్సు నుండే పిల్లలకు ప్రేమ, దయ, కరుణ వంటి విషయములు బోధించి వారికి తమకు కలిగిన వాటిలో ఇతరులకు సహాయము చేయుట నేర్పించినట్లైతే వారు నేర్చుకొని సమ సమాజ నిర్మాణములో పాలిభాగస్థులు కాగలరు. ఈలాగు వారు రూపాంతరము చెందుటకు దేవదేవుని సహాయం ఎంతో అవసరం. మన ప్రార్థనలలో దేవుడు మన పిల్లలకు అలాంటి శక్తిని అనుగ్రహించాలని, వారు కేవలం చదువుల యంత్రముల వలె కాక, మానవత్వపు విలువలతో ఎంతో ముందు ఉండాలని, వేడుకొందాము. ఆలాగు వారు జీవిస్తూ ఉంటే ప్రతి తల్లి, తండ్రి ఎంతో ఆనందించడం జరుగుతుంది. ఒక్క మనుష్యుడు జీవించే నిస్వార్థమైన జీవితం, లక్షల మంది అభాగ్యులకు నెమ్మది, క్షేమము, సంతోషం కలగడానికి కారణం అవుతుంది. కనుక మీరు, మీ పిల్లలు ఆలాగున జీవించే వారిగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 5 జూలై - ఆగష్టు, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- సమ్‌థింగ్ స్పెషల్ ........ 2
- ధనమును ఆశించిన ........ 6
- అమ్మా ... (స్త్రీల ప్రత్యేకం) ........ 8
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 35వ భాగము ........ 11
- స్వభావం (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- విశ్వాసంలో ఎదుగుట ........ 17
- ప్రార్థనా శక్తి ........ 20
- బైబిల్ క్విజ్-35 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# సమ్‌థింగ్ స్పెషల్

- బ్రదర్. ఎపఫ్రా

ఆశీర్వాదము అనే మాట ప్రతి మనిషికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. అందుకే మనుష్యులు ఆశీర్వాదము కొరకు గుళ్ళు, గోపురములు, చర్చిలు అని ఆధ్యాత్మిక కేంద్రముల వెంట తిరుగుతూ ఉంటారు. పుణ్యక్షేత్రముల చుట్టూ తిరగటం ద్వారా ఆశీర్వాదమును సంపాదించు కోగలమా? మరి ముఖ్యముగా మన దేశంలో ఆశీర్వాదం అనే పేరుతో అమాయక ప్రజలను ఎంతో మంది మోసం చేయడం చూస్తూ ఉంటాము. సృష్టించిన సృష్టికర్త తప్ప ఎవరూ ఒక మనిషిని ఆశీర్వదించలేరు. అబ్రాముకి పాదము పట్టునంత భూమి అయిననూ లేనప్పుడు నీ తరువాత నీ సంతానమునకు ఈ దేశమును ఇస్తానని దేవుడు వాగ్దానము చేసాడు, ఆ తరువాత వాగ్దానము నెరవేర్చాడు. ఎందుకు దేవుడు ఆ వాగ్దానమును నెరవేర్చాడు? అబ్రాములో ఉన్న ప్రత్యేకత ఏమిటి? అని పరిశీలించినప్పుడు అబ్రాములో కొన్ని ప్రత్యేకతలను చూడగలము. అవి దేవునికి ఎంతో ప్రీతికరమైనవి. అబ్రాము నోవహు పెద్ద కుమారుడైన షేము వంశావళిలో నుండి వచ్చిన తెరహు కుమారుడు.

**అబ్రాము జీవితములోని ప్రత్యేకతలను ధ్యానించుకుందాము :-**

**1. విధేయత చూపించుట:-**

అబ్రాము తండ్రి ఇంటిలో మొదటిగా పుట్టినవాడు. నీవు లేచి నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్ద నుండియు, నీ తండ్రి ఇంటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము (ఆది 12:1) అని చెప్పినప్పుడు అబ్రాము మారు మాట్లాడక, వెంటనే ఆ ప్రాంతము నుండి బయలుదేరి వెళ్లాడు. దేవుడు చెప్పిన మాటకు అబ్రాము విధేయత చూపించాడు.

**2. ప్రార్థించుట:-**

అబ్రాము దేవుని మాట చొప్పున బయలుదేరి వెళ్ళుచూ బేతేలుకు, హాయికి మధ్యలో గుడారము వేసికొనెను. అక్కడికి చేరిన వెంటనే ఆ ప్రదేశము, ప్రజలు ఎలాంటి వారో తెలుసుకుందామని ప్రయత్నించలేదు కానీ తనకు ప్రత్యక్షమై, వాగ్దానము చేసిన దేవునికి బలిపీఠమును కట్టి, ఏం చేయాలో తెలియని పరిస్థితులలో యెహోవా నామములో ప్రార్థన చేసెను.

**3. సమాధానమును కోరుకొనుట:-**

తన ఆస్తి విస్తరించుట వలన అబ్రాము ధనవంతుడయ్యాడు. అప్పుడు అబ్రాముతో కూడ వెంట వచ్చిన తమ్ముని కుమారుడైన లోతు గొర్రెల కాపరులకు, తన గొర్రెల

 **ఉత్తములు ఇతరులకు ఉపకారం చేసేటప్పుడు కూడా ఎంతో వినయ విధేయతలతో నడుచుకుంటారు.**



కాపరులకు గొడవలు జరుగుట అబ్రాము గమనించెను. మనము బంధువులము గనుక నాకును నీకును, నా పశువుల కాపరులకు, నీ పశువుల కాపరులకు కలహముండకూడదు, దయచేసి నన్ను విడిచి వేరుగా ఉండుము అని లోతుతో చెప్పాడు. సమాధానము కలిగి జీవించాలనే ఆలోచనతో అబ్రాము ఈ నిర్ణయం తీసుకున్నాడు. అంతేకాక లోతుతో నీవు ఎడమ తట్టునకు వెళ్లిన యెడల, నేను కుడి తట్టునకును, నీవు కుడి తట్టునకు వెళ్లిన యెడల, నేను ఎడమ తట్టుకు వెళ్లెదనని చెప్పెను – (ఆది 13:9) దీనిని బట్టి అబ్రాము గొప్ప విశ్వాసం గలవాడిగా కనబడుచున్నాడు. అంతేకాక గొడవలు పెట్టుకొనక, సమాధానమును కోరుకునే మనస్సుతో జీవిస్తున్నాడు. లోతు వెళ్లిపోయిన వెంటనే దేవుడు అబ్రాము యొక్క మంచి మనస్సును చూచి ఏం చెప్పాడంటే నాలుగువైపులా చూడు, దీనినంతటిని నీకును, నీ సంతానమునకును ఇస్తానని వాగ్దానం చేసాడు. నాలుగువైపులా అంటున్నాడు మరి లోతు ఎక్కడ? దేవుని మనస్సులో లోతు లేడని దీనిని బట్టి అర్థం అవుతుంది. కాబట్టి సమాధానమును కోరుకొనువారు తెలివి తక్కువ వారిగా కనిపించినా చివరికి వారే తెలివిగలవారు.

**4. శత్రువుని క్షమించుట :–**

తమ్ముడి కుమారుడైన లోతు వచ్చిన అవకాశమును ఉపయోగించుకొని, యెహోవా తోట వలె కనబడుచున్న పచ్చని ప్రదేశమును ఎంచుకొని వెళ్లిపోయాడు. ఆ సొదొమ, గొమొఱ్ఱా ప్రాంతముల మీద శత్రురాజులు దాడి చేసి లోతును, లోతు ఆస్తిని, స్త్రీలను పట్టుకుపోయారనే వార్తను విన్న అబ్రాము వెంటనే తన దగ్గర ఉన్న దాసులను వెంటబెట్టుకొని పోయి, శత్రువులను జయించి లోతును, ఆస్తిని, స్త్రీలను కాపాడెను.

లోతు అబ్రాముతో కూడా వచ్చిన వాడు. అబ్రాము పశువుల కాపరుల గురించి చెప్పినప్పుడు కానీ, వెళ్లమన్నప్పుడు కానీ నాదేముంది, నేను నీ వెంట వచ్చిన వాడను, నువ్వు ఎలా చెబితే అలా వింటాను అని అనకపోగా, ఇదే అవకాశం అన్నట్లుగా వెళ్లిపోయాడు. శత్రువు వలె ప్రవర్తించిన తన తమ్ముడి కుమారుడిని క్షమించి, సహాయం చేసాడు అబ్రాము.

**5. దశమ భాగం చెల్లించుట:–**

శత్రువులను జయించి అబ్రాము తిరిగి వచ్చుచున్నప్పుడు షాలేము రాజైన మెల్కీసెదెకు అను యాజకుడు రొట్టె, ద్రాక్షారసముతో అతనిని ఎదుర్కొని హృదయపూర్వకముగా దేవుని వాగ్దానమును బట్టి అతనిని ఆశీర్వదించాడు – ఆది 14:20. అప్పుడు అబ్రాము తనకు కలిగిన వాటన్నిలో పదియవ వంతు యాజకునికి ఇవ్వటం

జరిగింది.

పదియవ వంతు తమది కాదు దేవునిది అనే విషయము చాలా మందికి తెలియదు. దేవునికి చెందవలసిన పదియవ వంతును దాన ధర్మములు చేసేవారు ఉన్నారు. అలాగే పదియవ వంతు మేము ఇవ్వనక్కరలేదు అని, సేవకే ఖర్చుపెట్టుచున్నాము అని సమర్థించుకునే సేవకులు ఉన్నారు. కానీ అబ్రాము అలా చేయలేదు. తనకు రొట్టెను, ద్రాక్షారసమును తెచ్చి ఇచ్చిన యాజకునికి పదియవ వంతు ఇవ్వటం జరిగింది. దశమ భాగం విషయంలో కుంటి సాకులు చెప్పకుండా మనం వెళ్లే దేవుని మందిరములలో దేవునికి ఇచ్చే వారమై యుండాలి. దశమ భాగములను దేవుని మందిరములో ఇవ్వకుండా మందిరములు కట్టించుట కొరకు, మీటింగ్ ఖర్చుల కొరకు, టీ.వి ప్రోగ్రామ్స్ కొరకు ఉపయోగించుట పూర్తిగా వాక్యమునకు వ్యతిరేకమైన పనులు. దేవుని భాగమును మన చేతులతో ఖర్చు చేయుట, దేవుని సొమ్మును దొంగిలించి ఖర్చు చేయుట వంటిదే. కొందరు దేవుని సొమ్మును దొంగిలించి తమ అవసరతల కొరకు వినియోగించుకొంటుంటే, మరి కొందరు దేవుని పని అనే సాకుతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొనుటకు ఖర్చుచేయుచున్నారు. ఇలాంటి వారు దేవునిని ప్రేమిస్తున్నామని చెప్పటంలో అర్థం లేదు.

### 6. ఆతిథ్యము ఇచ్చే మనస్సు : -



అబ్రాహాము ఎండవేళ గుడార ద్వారము దగ్గర కూర్చుని ఉన్నప్పుడు, ముగ్గురు మనుష్యులు అతని యెదుట నిలువబడిరి. వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి, నేల మట్టుకు వంగి, (ఆది 18:2,3) ఆతిథ్యము ఇచ్చుటలో ఎంతో ఆత్రుత, ఆసక్తి అబ్రాహాములో కనబడుతున్నాయి. ఆ ఆతిథ్యమును స్వీకరించి, ముగ్గురు మనుష్యులు అబ్రాహామును ఆశీర్వదించి వెళ్లారు.

ఆతిథ్యము ఇచ్చే అవకాశము రావడం గొప్ప ధన్యత. ఆతిథ్యం తీసుకోవటం గొప్ప విషయము కాదు కాని ఇవ్వడం అనేది విలువైనది. ఆతిథ్యం అనేది ఈ దినములలో ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉన్నది. అబ్రాహాము ఇచ్చిన ఆతిథ్యం ప్రతిఫలం ఆశించనిది. ఇట్టి మనస్సు ఆశీర్వాదమును కలిగిస్తుంది.

### 7. సమర్పణ :-

అనేక సంవత్సరముల నిరీక్షణ తరువాత పుట్టిన వాగ్దాన పుత్రుడు. "నీకు ఒక్కడైయున్న నీ కుమారుని, అనగా నీవు ప్రేమించు ఇస్సాకుని తీసుకొని, దహనబలిగా

అతని నర్పించుమని చెప్పెను, (ఆది 22:2)



దేవుడు మనుష్యులను దహన బలిగా అడగటం చరిత్రలో అంతకు ముందు ఎప్పుడూ జరుగలేదు. అయినప్పటికీ అబ్రాహాము సందేహింపక తన పనివారిలో ఇద్దరిని వెంటబెట్టుకొని ఇస్సాకుతో కలిసి ఆ చోటికి వెళ్లెను. మార్గ మధ్యంలో ఆ చిన్నవాడు అమాయకంగా నా తండ్రీ! కట్టెలును, నిప్పును ఉన్నాయి కాని దహన బలికి గొర్రె పిల్ల ఏది అని అడిగెను. కుమారుడా! దేవుడే చూచుకొనును అని చెప్పి సముదాయించెను.

దేవుడు చెప్పిన చోటికి వచ్చి, బలిపీఠము కట్టి, బలిపీఠము మీద కట్టెలు పేర్చి, తన కుమారుడైన ఇస్సాకును బంధించి కట్టెలపై ఉంచెను. ఇస్సాకును వధించుటకు చేయి చాపి కత్తి పట్టుకొనగా యెహోవా దూత పరలోకము నుండి అబ్రాహామా, అబ్రాహామా ఆ చిన్న వాని మీద చేయి వేయకుము. ఒక్కడే అయ్యున్న నీ కుమారుని ఇచ్చుటకు వెనుతీయలేదు కనుక నీవు దేవునికి భయపడే వాడవని నాకు కనబడుచున్నదని చెప్పెను. నీవు నా మాట వినినందున, భూలోక నివాసులందరు నీ సంతానము వలన ఆశీర్వదించబడుదురని చెప్పెను.

ప్రియ చదువరీ! అబ్రాహాము యొక్క జీవితంలో పైన పరిశీలించిన 7 లక్షణములు సామాన్యమైన వ్యక్తిని ఆశీర్వాదానికి కేంద్ర బిందువుగా మార్చటం జరిగింది. కాబట్టి మనము ఆశీర్వదించబడటం మాత్రమే కాకుండా మన ద్వారా అనేకులను ఆశీర్వదించే దేవుడు మన ప్రభువైన యేసుక్రీస్తు. మనం కూడా జీవితంలో అబ్రాహాము గుణలక్షణములు కలిగి ముందుకు కొనసాగుదాం.

దేవుడు మిమ్ములను ఆశీర్వదించును గాక !

# ధనమును ఆశించిన....

ధనము విషయములో ప్రతి మనుష్యునికి ఒక స్పష్టమైన అభిప్రాయం అవసరమైయున్నది. ముఖ్యముగా క్రీస్తునందు ఉన్న వారికి మరింత స్పష్టత అవసరం. ధనము లేక సంపద అనేవి ఆశించుట కంటే శ్రద్ధగా పనిచేయుట ద్వారా నీ ఆర్థిక పరిస్థితులు సరిగాను, సక్రమముగాను ఉంటాయి. గత సంచికలో ఇస్కరియోతు యూదా గురించి ధ్యానించడం జరిగింది. అతడు కూడా మిగిలిన శిష్యుల వంటి వాడే కానీ అతనిలోని ధనాపేక్ష అతనిని భ్రష్టమనస్సునకు నడిపించింది.

మరొక సంఘటన అపోస్తలుల కార్యములలో మనము చూడగలం. ఇక్కడ అలనాటి సంఘములో ఉన్న ప్రతి ఒక్కరు ఎంతో సమర్పణతో తమకు కలిగినది ఏది తమది కాదు అనే తీర్మానముతో జీవిస్తున్నారు. అంతే కాక తమ స్థిర, చరాస్థులను అమ్మి, యేసయ్య శిష్యుల పాదముల యొద్ద పెట్టి సమర్పణతో జీవిస్తున్నారు. ప్రతి వాని అవసరతకు శిష్యులు ఖర్చుపెడుతూ వచ్చారు. వారిలో ప్రత్యేకముగా బర్నబా అనే వ్యక్తి బహుధనవంతుడై యుండి, తన ఆస్థి అంతటిని అమ్మి, శిష్యుల పాదముల యొద్ద పెట్టడం జరిగింది. ఆ దినములలో ఎవ్వరిని చూచినా నిస్వార్థ హృదయం, సమర్పణ కలిగిన మనస్సుతో జీవిస్తూ ఉన్నారు. వారిలో అననీయ అనే ఒక మనుష్యుడు ఉండెను.

**అననీయ అను ఒక మనుష్యుడు తన భార్యయైన సప్పీరాతో ఏకమై పొలమమ్మెను। భార్య యెరుకనే వాడు దాని వెలలో కొంత దాచుకొని కొంత తెచ్చి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టెను। - అపొ॥కా 5:1,2**

అతను పొలం అమ్ముటకు ఎవ్వరూ బలవంతము చేయలేదు, తనకు తానే పొలము అమ్మడం జరిగింది. కాని అమ్మిన తరువాత ధనమును చూచి మనస్సు నందు దానిని ఆశించి కొంత భాగము దాచి పెట్టుకోవడం జరిగింది. తాను కొంతభాగము ఎందుకు దాచిపెట్టుకొనుచున్నాడో అతనికి కూడా సరియైన అవగాహన ఉన్నట్లు కనిపించుట లేదు. వాస్తవముగా చాలా మందికి వారు ధనమును లేక సంపదను ఎందుకు ఆశించుచున్నారో సరిగా తెలియదు. ధనము కేవలము మన అవసరతను తీర్చుకొనుటకు ఉపయోగపడేది మాత్రమే అనే సంగతి గ్రహింపనొల్లని వారిగా ఉన్నారు. మనుష్యులు ధనము కంటే ఎంతో విలువైన వారు అనే సంగతే చాలామందికి తెలియదు.

ధనమును ఆశించి తమ తల్లిదండ్రులను, తోడబుట్టిన వారిని, తోటివారిని కూడా దూరం చేసుకుంటున్నవారు ఎందరో ఉన్నారు. అన్నింటి కంటె ముఖ్యముగా ఒక్క శరీరము అని దేవుని చేత నిర్ణయించబడిన భార్య భర్తలలో కూడా ధనము అనేది ఎన్నో బేధములు తెచ్చిపెట్టడం మనం చూస్తున్నాము. నేటి సమాజంలో ఎన్నో కుటుంబములు విచ్ఛిన్నమై

పోవుటకు ధనాపేక్షే కారణం. ధనాపేక్ష సమస్త కీడులకు మూలం అని దేవుడు తెలియపరచినట్లుగా ఒక విధమైన కీడు కాదు కాని సమస్త కీడులకు అది మూలము అనే సంగతి సుస్పష్టముగా ప్రతి విశ్వాసి ఎరుగవలసిన సత్యం. దీనిని గ్రహించకుండా జీవించువారు ఎన్నో సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. తిమోతికి పౌలు వ్రాసిన మొదటి ఉత్తరములో కూడా ఎంతో వివరముగా తెలియపరచడం జరిగింది. **ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. - 1 తిమోతి 6:9,10** దైవ సంబంధమైన కార్యములలో నేను మునిగియున్నాను కనుక ధనము విషయములో ఎలా ఉన్నా ఫర్వాలేదు అనుకొనుట సరియైనది కాదు.

అననీయ, సప్పీరా అనువారు కూడ దైవ భక్తిలో ఎంతో ఆసక్తి కలిగిన వారే కాని వారి హృదయములలో ధనము గూర్చిన ఆశ లేక అపేక్ష వారిని భయంకరమైన స్థితిలోకి తీసుకొని వెళ్ళింది, వారి ప్రాణములను కూడా పోగొట్టుకున్నారు. వారు ఇక ఏమాత్రము సరిచేసికొనుటకు అవకాశం లేకుండా నశించిపోయారు.

ప్రియమైన దేవుని పిల్లలారా ! మీ జీవితంలో ధనము విషయంలో సరియైన క్రమమును కలిగి జీవించవలసినదిగా మిమ్మును వేడుకొనుచున్నాను. యథార్థవంతులను బలపరుచుటకు దేవుడు ఎల్లప్పుడు సిద్ధముగా ఉన్నాడు. కనుక నీవు ధనాపేక్షతో తొందర చేయబడక ఆయన నిన్ను ఉంచిన స్థితిలో సంతోషముగా జీవించు. అప్పుడు నీకు కావలసిన సమస్తము ఆయన వలన పొందుకొనుట జరుగుతుంది.



# అమ్మా...

- సిస్టర్ విజయ

**యేసు - అమ్మా యెందుకు ఏడ్చుచున్నావు ?**
**ఎవనిని వెదకుచున్నావు. - యోహాను 20:15**

క్రొత్త నిబంధనా గ్రంథములో చెప్పబడిన స్త్రీలలో **మగ్ధలేనే మరియను** ఒక ప్రత్యేకమైన మరియు అత్యున్నతమైన స్త్రీగా గుర్తించవచ్చును. యేసుక్రీస్తు శరీరధారిగా ఉన్న దినములలో మగ్ధలేనే అనబడిన మరియను పట్టిన ఏడు దయ్యముల నుండి విడిపించెను. ఆయన దేవుని రాజ్య సువార్తను తెలుపుచు, ప్రకటించుచు, ప్రతి పట్టణములోను, ప్రతి గ్రామములోను సంచారము చేయుచుండగా కొంతమంది స్త్రీలైన వారు, ఇతరులనేకులును తమకు కలిగిన ఆసక్తితో ఆయనకు ఉపచారము చేయుచూ ఆయనతో కూడా ఉండిరి. ఆ స్త్రీలలో మగ్దలేనే మరియ కూడా ఉన్నట్లుగా బైబిలు గ్రంథము చెప్పుచున్నది. ప్రభువైన యేసుక్రీస్తు సిలువ వేయబడిన తరువాత విశ్రాంతి దినము గడిచిన తరువాత ఆదివారము ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్ధలేనే మరియ ప్రభువును చూచి, ఆయన దేహమునకు సుగంధద్రవ్యములను పూయవలెనని వెళ్ళి అక్కడ సమాధి మీద రాయి తీయబడి యుండుట చూచెను. ఆమె సమాధిలోకి వంగి చూచుచూ ఆయన కనబడక పోవుట చూచి ఏడ్చుచుండెను.



మరియ యేసయ్య మీద ఎంత ప్రేమను కలిగి ఉన్నదో దీనిని బట్టి మనకి అర్థమవుతుంది. ఏదైనా మేలు, మంచి కార్యము జరిగితేనే ఆయనను ప్రేమించుట కాదు కానీ నా పాపముల కొరకు ఆయన సిలువలో మరణించారు, నశించిపోయే నన్ను రక్షించి ఆయన కృపలో నడిపిస్తున్నారు అని గ్రహించిన వారమైతే మన చివరి శ్వాస వరకు ఆయనను ప్రేమిస్తూనే ఉంటాము. వారిద్దరి మధ్య ఉన్న ప్రేమను బట్టి ప్రభువు ఏమయ్యారో అని ఆమె ఏడుస్తుండగా, ఆమె ఎందుకు ఏడుస్తుందో ప్రభువుకి తెలిసిననూ ఆయన ఆమెను వదిలివేయక **అమ్మా! యెందుకు ఏడ్చుచున్నావు** అని ఆదరణ కలుగునట్లుగా అడుగు చున్నారు.

మన జీవితములలో ఏ నిమిషములో ఎటువంటి ఆటుపోట్లు, సమస్యలు, మార్పులు కలుగుతాయో ఊహించలేము. కొన్ని ప్రభువు మనలను పరీక్షించడానికి కలిగితే, మరికొన్ని మన బాధ్యతను నిర్వర్తించకపోవుట చేత కలుగుతాయి. మన జీవితములో కలిగే ప్రతి పరిస్థితి ఆయనకు తెలుసు. మనము తప్పిపోయి, బలహీనతలలో పడిపోయేది కూడా

ప్రభువుకు తెలుసు. కుటుంబ బాధ్యతతో ఉండవలసిన యజమానులు వ్యసనములతో బంధించబడి, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటే, కుటుంబమును ఏ విధంగా నడిపించుకోవాలో తెలియక కొంతమంది, యౌవ్వన బిడ్డల తిరుగుబాటు స్వభావముల వలన కలిగే అసమాధానములు కుటుంబములో రాజ్యమేలుతుంటే ఏమి చేయాలో తెలియక కొంతమంది, ఆర్థిక సమస్యలతోను, అనారోగ్య పరిస్థితులతో శరీరము సహకరించక భారముగా దినములను గడుపుతూ ఇంకొంత మంది, చివరి శ్వాస వరకు దేవునిలోనే జీవించాలని, ఆయన ప్రేమ నుండి ఏదీ వేరు చేయకూడదనే ఆశని కలిగి ఉన్ననూ, జయించలేని ఆత్మీయ బలహీనతల నుండి విడుదల పొందాలని మరి కొంత మంది నిస్సహాయ స్థితిలో కన్నీరు కారుస్తూ ఉంటే, మన ప్రభువైన యేసుక్రీస్తు **అమ్మా! ఎందుకు ఏడ్చుచున్నావు** అని అడుగుచున్నారు. ఎంత ప్రేమ కలిగిన మాట ప్రియమైన వారలారా! అనగా మన కన్నీరుని ఆయన చూచుచున్నారు అని దీనిని బట్టి అర్థమవుచున్నది. మనకి ఉన్న పరిస్థితులు ఎలాంటివైనప్పటికి దేవుని వైపు కన్నీటితో చూచినప్పుడు, మనలను విడువక ఎంతగానో ప్రేమించుచున్న దేవుడు న్యాయబద్ధంగా, వాస్తవంగా ఆయన సన్నిధిలో విడిచిన కన్నీటిని వ్యర్థము చేయరు.

దేవుని ప్రేమ కలిగిన మనుష్యులే మన కన్నీటిని చూచి, చలించిపోతుంటే దేవాధి దేవుడైన యేసయ్య తప్పక మన కన్నీటిని చూచి, కనికరపడతారు. విడిచిపెట్టక ప్రతిఫలమును ఇస్తారు. మన యెడల ఆయన కలిగి ఉన్న ప్రేమకు ఏమిచ్చి ఋణము తీర్చుకోగలము? ఆయనపై ఎంత ప్రేమను మనము కలిగి ఉంటున్నాము? ఏదైనా పెద్ద సమస్య, భరించలేని బాధ కలిగినప్పుడు, నాకు మేలులేమీ జరగలేదు అని దేవునిని దూషించి, సణిగి ఆయన మార్గములను విడిచే వారిగా ఉన్నామా? దేవుని కృప, సహాయముతో మాత్రమే ఆయన మీద అమితమైన విశ్వాసముతో ముందుకి వెళతాను అనే ఆలోచనతో సాగుతున్నామా? నిర్ణయము మనదై ఉండాలి. ఎందుకనగా ఏ విషయమున కైననూ కుటుంబములో స్త్రీకి స్పందించే తీరు అధికంగా ఉంటుంది. సంతోషకరమైనదైతే మనస్సులో మాటి మాటికి జ్ఞాపకం చేసుకుంటూ మైమరిచిపోతుంది, దుఃఖకరమైనదైతే తనలో తానే వేదనతో లోలోపల రోదిస్తూ కుమిలిపోతుంది.

కొంతమంది ఏదైనా బాధ, సమస్య కలిగిన వెంటనే మనుష్యుల వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్ళి వారి దగ్గర బాధపడి, ఏడుస్తూ ఉంటారు. కానీ కనబడుచున్న వ్యక్తి కంటే వ్యక్తిత్వ, దైవ విలువలు కలిగి ఎల్లప్పుడు మనకి సహాయం చేసే దేవుని చేతులలో ఉండడానికి ఇష్టపడి, ఆయన సన్నిధికి వెళ్ళి వేడుకునే వారిగా ఉండాలి. మనకి బాధ కలిగి, ఒంటరిగా ఉన్న సమయములలో మనకు సహాయం చేయడానికి తన దూతలకు ఆజ్ఞాపించే తండ్రిని మనము కలిగి ఉన్నామని మరువద్దు.

బైబిల్‌గ్రంథములో మరికొంత మంది స్త్రీలు కార్చిన కన్నీటి ద్వారా ఆయన కనికరమును పొంది, చనిపోయిన తమ వారిని బ్రతికించుకో గలిగారు. బేతనియ గ్రామములోని మరియ, మార్త, లాజరు అను వారి కుటుంబములో లాజరు చనిపోయి సమాధిలో ఉంచబడ్డాడు. 4 దినముల తరువాత ప్రభువు ఆ ప్రాంతమునకు వచ్చినప్పుడు మరియ యేసు ఉన్న చోటికి వచ్చి ఆయనను చూచి ఆయన పాదముల మీద పడి ప్రభువా, నీవిక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండు ననెను. ఆమె ఏడ్చుటయు ఆమెతో కూడా వచ్చిన యూదులు ఏడ్చుటయూ యేసు చూచి, కలవరపడి ఆత్మలో మూలుగుచూ లాజరుని ఎక్కడ ఉంచితిరని అడిగెను. యేసు కన్నీళ్ళు విడిచెను. లాజరుని సమాధిలో నుండి బయటకు రమ్మని పిలిచి సజీవుడిగా నిలిపెను.





నాయీను అను గ్రామములో ఒక విధవరాలి కుమారుడు చనిపోయి పాతిపెట్టడానికి తీసుకువెళుతుండగా ఆ తల్లి కన్నీటిని చూచిన యేసు ప్రభువు కనికరపడి, ఏడ్వవద్దని చెప్పి, పాడె ఆపి అతనిని ముట్టి సజీవుడిగా ఆమెకి అప్పగించారు.

పాత నిబంధనా గ్రంథంలో హన్నా తనకి కలుగుచున్న అవమానములు, నిందలు హేళనలను బట్టి దేవుని సన్నిధిలో తన హృదయమంతటిని క్రుమ్మరించి పడిన బాధ, కార్చిన కన్నీరు అక్కడ దేవుని యాజకుడిగా ఉన్న ఏలీ నుండి ఒక వాగ్దానము పొందుకొనేటట్లుగా చేసింది. ప్రతిఫలముగా దేవుని నుండి కుమారుడిని పొందుకుంది.



చూశారా! సహోదరీలారా! యేసయ్య కనిపించలేదు అని ఆయన మీద ప్రేమతో కన్నీరు కార్చిన మరియ ప్రపంచమునకు పునరుత్థానమును మొదటిగా  ప్రకటించిన మొట్ట మొదటి స్త్రీ అయ్యింది. చనిపోయిన సహోదరుడిని మరియ మార్తలు,  చనిపోయిన కుమారుడిని విధవరాలు సజీవులుగా తిరిగి పొందుకోగలిగారు. హన్నా యొక్క కుమారుడైన సమూయేలు గొప్ప ప్రవక్తగా ఇశ్రాయేలు దేశములో నిలిచాడు.

కనుక కన్నీటిని తుడిచి, అద్భుతములను వారి జీవితములలో జరిగించిన దేవుడు నిశ్చయముగా మనలను ఆదరించి కన్నీటిని తుడిచి ప్రతిఫలమును కలుగజేస్తారు. కాబట్టి ప్రార్థించి, సంతోషమును కలిగి ఉండుడి.

అట్టి సంతోషమును దేవుడు మనకి అనుగ్రహించును గాక !

 నిజమైన వైరాగ్యం అన్నింటిని వదిలివేయడం కాదు, మనసులో మాలిన్యమును తీసివేసుకోవడం.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 35వ భాగము

1916వ సంవత్సరం ఓ మండు వేసవిలో తండ్రి నుండి సుందర్‌కో ఉత్తరమందింది. "నా ప్రియ కుమారుడా, నా కంటి దీపమా, నా ఆశాకిరణమా దీర్ఘాయుష్మాన్‌భవ" అంటూ మొదలయ్యిందా ఉత్తరం. వివాహ విషయమును తెలియజేస్తూ అంతకు ముందు తండ్రి వ్రాసిన ఉత్తరమునకు జవాబు వ్రాయనందుకు ఈ ఉత్తరములో తన అసహనమును చూపుతూ, "నీ ఇష్టాయిష్టాల కోసం నేను ఆగేది లేదు. వెంటనే పెండ్లికి సిద్ధపడు" ఆజ్ఞాపిస్తున్నాడు తండ్రి. "నీ క్రైస్తవమతము తల్లిదండ్రులకు లోబడవద్దంటున్నదా? వివాహం చేసుకొని క్రీస్తును నీవు సేవించకూడదా? మన ఇంటి పేరు రూపుమాపాలనుకుంటున్నావా? మరి నీ ఇల్లు, ఆస్థిపాస్తుల సంగతేమంటావు ? ఇలా ఎన్నో వాగ్వాద ప్రశ్నలడిగి ఆకర్షణీయముగా కనబడే ఓ ప్రతిపాదనను తన కుమారుని ముందు ఉంచాడు తండ్రి. ఈ సంబంధమునకు నీవు ఒప్పుకుంటే వెంటనే 300 రూపాయలు (ఆ దినములలో అది చాలా పెద్ద మొత్తము) నీకిస్తారు. దీనికి నీవు కాదంటే ఆస్థిలో చిల్లిగవ్వ కూడ నీకు దక్కదని హెచ్చరిస్తూ ముగించాడు తండ్రి.

క్రైస్తవుడనైనపుడే డబ్బు, ఆస్థిపాస్తులను గూర్చి ఆశలు వదులుకొన్నానని, నాగటి మీద చేయి వేసిన తరువాత వెనుదిరిగి చూడడానికి తాను సిద్ధంగా లేనని, ఇక వివాహ విషయమునకొస్తే నేనెల్లప్పుడూ మీకు విధేయునిగానే ఉన్నాను. నిండు మనస్సుతో మిమ్ములను సేవించుటకు సిద్ధమేగాని నా పూర్ణమనస్సుతోను బలముతోను, నేను సేవించాల్సిన పరలోకపు తండ్రి నాకు ఉన్నాడు గనుక నేను వివాహం చేసుకోలేను. ఇది నా జీవితాశయం. వివాహం చేసికొంటే నా ధర్మమును నమ్మకంగా నిర్వర్తించలేను. అంతేగాక పెండ్లి చేసుకోవాలన్న ఆశ కూడ నాకు లేదు, అని జవాబు వ్రాశాడు సుందర్. ఆ దినములలో సుందర్ పెండ్లి విషయమై అతని తండ్రి మాత్రమే గాక ఇంకెందరో శ్రేయోభిలాషులు, స్నేహితులు ఆయనని అడిగారు, ఉత్తరాలు వ్రాశారు. ఇవన్నీ తనకి ఎంతో శోధనకరంగా ఉన్నాయని ఒక స్నేహితునికి చెప్పాడు సుందర్. కాబట్టి అతని అనుమతితోనే వెర్రీగారు తన వారపత్రికలో ఇలా ప్రకటించారు. భారతీయ సహచరునిగా కష్టమైన విషయములను గూర్చి వెర్రీతో సంప్రదిస్తుంటాడు సుందర్. వివాహ విషయములో అతడు పూర్తిగా విసిగియున్నట్లు

గమనించాడు. పవిత్రమైన వివాహబంధం చెడ్డదని భావించి కాదు గాని దేవుడు తనకి అప్పగించిన కార్యనిర్వహణకు వివాహం ఎంతో పెద్ద ప్రతిబంధకం కాగలదని తలంచడం వలన ఎన్నటెన్నటికిని పెండ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాడు. ఆయనను వివాహమాడగోరుచున్న ఆ యౌవనురాలును, తరచుగా ఉత్తరములతోను, మాటలతోను పెండ్లి చేసుకోమని ఆయనను ఒత్తిడి చేసే పెద్దమనుషులు ఇకమీదట అలా చేయవద్దని మనవి చేసుకొంటున్నాను. దీనికి బదులుగా తమ ప్రార్థనలతో వారాయనకు సహాయం చేయాలని నా విన్నపం. తాను మారుమనస్సు పొందినప్పటి నుండి వివాహ విషయమును గూర్చిన ఉత్తరాలు, పెండ్లి చేసుకోమని సలహాలిచ్చేవారును తనకి ఎంతో శోధనగా ఉన్నారని అతడు తలంచుచున్నాడని పత్రికా ముఖంగా తెలియజేశాడీ స్నేహితుడు. ఇలాంటి శోధనను దేవుడు ఎందుకు రానిచ్చాడా అని సుందర్ ఆశ్చర్యపడిన సందర్భములు లేకపోలేదు. అయితే ఒకవేళ తన మేలు కొరకే దేవుడీ శోధనను రానిచ్చాడేమోనని తలస్తూ ఓ దేవా నీ చిత్తానుసారముగా నా యౌవనజీవితమును వాడుకోమని ప్రార్థిస్తూ నా యౌవన జీవితాన్ని ఆయన పాదములపై ఉంచినానో లేదో పరీక్షించడానికే దేవుడీ శోధనను పంపించి యుంటారని తలంచాడు.

ఆ దినములలో సుందర్ వివాహ విషయమే గాక కైలాస మహర్షిని గురించి సుందర్ వ్రాసిన విషయములు, ఆయన చెప్పిన మాటలు ప్రజలలో చర్చాంశనీయాలై దేవుడు ఆయనను పిలిచి అప్పగించిన సువార్త ప్రకటన అనే ప్రథమ కర్తవ్యం నుండి ఆయన దీక్షను మరల్చాయి. మహర్షిని గురించి సుందర్ వ్రాసిన విషయములు ఎన్నో ఊహాగానాలను రేకెత్తించి ప్రజలలో ఉత్సుకతను పెంచాయి. అలాంటి మహర్షి ఉంటాడనే దానిని ఎందరో సందేహించగా కొందరు ఒక అడుగు ముందుకు వెళ్ళి ఈ యౌవన సాధువుకి వచ్చిన కలల వలన అతడు ఊహించుకున్న వ్యక్తే మహర్షి అని ధ్యానముద్రలో అతడు సుందర్‌కి కనిపించి ఉంటాడని అననారంభించారు. దేవుని సేవలో తాను ముమ్మరంగా ఉన్నందువలన ప్రతి వారికి జవాబీయడం కష్టమని చెప్తూ వెర్రీగారి పత్రిక ద్వారా వారి సందేహములను నివృత్తి చేయడానికి శాయశక్తులా ప్రయత్నించాడు సుందర్.

సేకరించబడింది

(ఇంకా ఉంది)

# స్వభావం



పిల్లలూ! బావున్నారా? schools start అయ్యాయి కదా! busy busy గా ఉన్నారేమో, క్రొత్త class booksతో. Home works చేసుకుంటూ, బాగా చదువుతున్నారా ? Teachers Lessons చెప్పేటప్పుడు శ్రద్ధగా వినండి, వింటే చదివేటప్పుడు Easyగా ఉంటుంది. దేవునికి ప్రతీ విషయమునూ తెలియజేయండి. కృతజ్ఞత కలిగి ఉండండి. దేవుడు మీ ప్రతీ అవసరమునూ తీర్చును గాక ! ఇంక స్టోరీ మొదలు పెట్టనా !!! ??

అనగనగా ఒక ఊరిలో దయానంద్ అనే సండే స్కూల్ టీచర్ ఉండేవాడు, చాలా మంచివాడు. ఏది చేసినా అర్ధవంతంగా చేసేవాడు. చిన్న పిల్లలకు యేసుక్రీస్తును బోధించడమే కాదు తన జీవితంలో కూడా చాలా క్రమశిక్షణగా ఉండేవాడు. తనకు సాధ్యమైనంత మట్టుకూ మేలు మాత్రమే చేసేవాడు ఎవరికీ కీడు తలపెట్టేవాడు కాదు.

దయానంద్ ప్రతి దినం ఒక చెఱువు దగ్గరకు వెళ్ళి అక్కడ పిల్లలకు నేర్పించ వలసిన పాఠాలను, బైబిల్ ధ్యానాలను చేస్తూండేవాడు. అటుగా వెళ్ళేవారు అతనిని చూచి వారికి తోచిన విషయాల గురించి సంభాషిస్తూ ఉండేవారు. ఓపికగా సమాధానము చెప్పేవాడు దయానంద్.

ఒకరోజు ఆ చెఱువులో ఒక తేలు మునిగిపోతూ కనపడుతుంది దయానంద్‌కు, దానిని రక్షించాలని చేయి చాపి దానిని పైకి తీస్తుంటే ఆ తేలు కుడుతుంది, దానిని వదిలేశాడు. మళ్ళీ పాపం అని మళ్ళీ చేయి పెట్టి తేలుని తీశాడు, మళ్ళీ కుడుతుంది. ఇలా 4,5 సార్లు పట్టుకోవడం వదిలివేయడం చేస్తాడు. చివరికి చాలా చాలా ఓర్చుకుని తేలుని, గట్టుమీద వేస్తాడు. అటుగా వెళ్ళే ఒక పెద్దాయన ఇది అంతా చూచి ఫక్కున నవ్వుతాడు. దాని వలన నీకు ఏమి ఉపయోగం ఆ తేలు నిన్ను కుట్టిననూ వదలకుండా దానిని నీటిలో నుండి

రక్షించావు అని ప్రశ్నిస్తాడు ! అందుకు దయానంద్ చిరునవ్వుతో ... చూడు అన్నా ! తేలు నీటిలో చనిపోతూ కూడా దాని స్వభావమును మార్చుకోలేదు. కుట్టడం దాని స్వభావం అందుకే అది నన్ను కుట్టింది. “మనుష్యులమైన మనము ఆపదలో ఉన్న వారిని రక్షించాలని దేవుని ఉద్ధేశ్యం, కాబట్టి మనిషినైన నేను నన్ను కుట్టిందని రక్షించటం ఎలా మానతాను. నా స్వభావం ఎలా మార్చుకోను ? తేలు ప్రాణం పోతున్నా దాని స్వభావం విడువనట్లే నేను బాధకలిగినా దానిని రక్షించే మనస్సును కాపాడుకున్నాను అందుకే రక్షించాను అని చెప్పిన మాటలకు ఆ పెద్ద మనిషి చాలా ఆశ్చర్యపోతాడు... ఆ రోజు నుండి పెద్ద వాడైనప్పటికీ, దయానంద్ దగ్గర అనేక విషయాలు తెలుసుకుని యేసుక్రీస్తుని స్వంత రక్షకునిగా అంగీకరిస్తాడు.

పిల్లలూ ! నేను వ్రాసిన కథని చదివారు కదా ! ఆ కథలోని సారాంశం తేలును రక్షించాలని కాదు కానీ, మనకి కీడు చేసే మనుష్యులకు కూడా మేలు చేసే హృదయముతో జీవించాలని. కాబట్టి మీ బాల్య దినముల నుండే మనుష్యులందరి యెడల దయ, కనికరం చూపుతూ, ఆపదలో ఉన్నవారికి విడువక సహాయం చేస్తూ జీవించాలని కోరుకొనుచున్నాను.

– మీ అక్కయ్య

## ముఖ్య గమనిక:

మీ ప్రార్ధనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# "నా జీవితములో దేవుని మేలులు"

**విజయ్, గుంటూరు**

గుంటూరు జిల్లా, భట్టిప్రోలు మండలం, చింతమోటు గ్రామములో నేను జన్మించాను. నా తల్లిదండ్రులు నాకు విజయ్‌బాబు అని పేరు పెట్టారు. పుట్టుకతోనే క్రైస్తవులైన నా తల్లితండ్రులు పండుగలకి మాత్రమే ప్రార్ధనలకి వెళ్తూ, నామకార్ధంగా జీవించేవారు. నా చిన్నప్పుడే మా అమ్మకి పక్షవాతం (పెరాలసిస్) అనే అనారోగ్యం కలిగింది. డాక్టర్లు తగ్గడం కష్టం అన్నారు. ప్రార్థన చేసుకోవడం ద్వారా అనారోగ్యమును దేవుడు స్వస్థపరిచాడు. అప్పటి నుండి ప్రతి ఆదివారం మా అమ్మ చర్చికి వెళ్తూ, నన్నూ, మా తమ్ముడిని తీసుకొని వెళ్ళేది. దేవుడిని నమ్ముకుంటే చదువులో జ్ఞానము, మంచి ఆరోగ్యము ఇస్తారు అని చెప్పేది. మా నాన్న విపరీతముగా త్రాగుచూ, ఇంటి బాధ్యతలు ఏ మాత్రం పట్టించుకునే వాడు కాదు, పైగా ప్రార్థనకు వెళ్ళేవారిని తిడుతూ ఉండేవాడు. మా అమ్మ ప్రార్ధన చేసుకుంటే, గొడవ పెట్టుకొని కొడుతూ ఉండేవాడు. మాది చాలా పేద కుటుంబము. నేను 9వ క్లాస్‌లో దేవుని సొంతరక్షకునిగా అంగీకరించి, మారుమనస్సు పొంది, బాప్తిస్మము తీసుకున్నాను. అప్పటి నుండి ఎవరో నా చేయి పట్టుకొని నడిపిస్తున్నట్లుగా అనిపించేది. నాకు బాధ కలిగినప్పుడు వాక్యం ద్వారా ధైర్యం తెచ్చుకునేవాడిని. నేను 10వ క్లాస్ వరకు గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకున్నాను. నోట్‌బుక్స్ కొనడానికి కూడా డబ్బులు ఉండేవి కావు. సమ్మర్ హాలీడేస్‌లో అమ్మతో పాటు కూలీపనులకు వెళ్ళేవాడిని. నాకు చిన్నతనంలోనే ఎడమకాలికి పోలియో వచ్చినందు వలన పని సరిగా చేయలేకపోయేవాడిని. అప్పుడప్పుడూ పని చేస్తూ, మధ్యలో క్రిందపడిపోయేవాడిని, అది చూచి మా అమ్మ చాలా బాధపడేది. ఎందుకు నాకు ఈ పరిస్థితా ? అని ఆలోచించేవాడిని. అలాంటప్పుడు బైబిల్ వాక్యమును గుర్తు తెచ్చుకొని, భవిష్యత్‌లో దేవుడు నన్ను మంచి స్థితిలో ఉంచుతాడని ధైర్యం తెచ్చుకొనేవాడిని. 10క్లాస్ అయిపోయిన తరువాత ఏమి చదువుకోవాలి ? ఏ కోర్స్ చదువుకుంటే జాబ్ వస్తుంది ? అనేవి ఏమి తెలియవు.

మా ఊరిలో ఎవరూ చదువుకోలేదు, అందరూ కూలీ పనులు చేసుకొనేవారు. దైవసేవకులు మోజెస్ అయ్యగారు మా ఊరికి వచ్చినప్పుడు చెప్పి, ప్రార్థన చేయించుకున్నాను. తరువాత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్ వ్రాయడం జరిగింది. ఇంగ్లీష్ మీడియం నేను చదవలేనని భయపడుతున్నప్పుడు, సేవకులు భయపడకు అని ధైర్యం చెప్పారు. కాలేజీ ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి. మంచి కాలేజీలో సీటు రావాలని ప్రార్థన చేసుకునేవాడిని. ఖాళీ సమయములో ఎక్కడ ప్రార్థన ఉంటే అక్కడికి వెళ్ళేవాడిని. దేవుని కృపని బట్టి రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీలో సీటు వచ్చింది. కాలేజీ ఫీజు కట్టకుండా

ఉచితముగా డిప్లొమో చదువుకోవడానికి దేవుడు సహాయం చేశారు.

డిప్లొమో కంప్లీట్ అయిన తరువాత జాబ్ గురించి హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్న మా బంధువులలో ఒక వ్యక్తిని అడిగాను, చూస్తాను అన్నాడు. ఆ తరువాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఫోన్ లిఫ్ట్ చేయడం మానేశాడు. అప్పుడు జాబ్ గురించి మోజెస్ పాస్టరుగారితో చెప్పినప్పుడు హైదరాబాద్ తీసుకువచ్చి, బ్రదర్.ఎపఫ్రా గారికి పరిచయం చేశారు. నేను హైదరాబాద్ వచ్చేటప్పటికి 400రూ.మాత్రమే నా దగ్గర ఉన్నాయి, సరిగా ఛార్జీలకు కూడా సరిపోని పరిస్థితి.

ఎపఫ్రా అన్నయ్య చెప్పే వాక్యం నాకు వ్యక్తిగతముగా ఎంతో ధైర్యంగా అనిపించేది. వాక్యం వింటున్నప్పుడు దేవునిపై ఆధారపడితే ఇబ్బంది లేకుండా బ్రతకవచ్చు అని అనిపించేది. జాబ్ లేకపోయినా మంచి పరిచర్యను దేవుడు అనుగ్రహించాడని సంతోషం ఉండేది. నాకు ఉన్న అంగవైకల్యమును బట్టి జాబ్ సరిగా చేయగలనో లేదో అని, జాబ్ ఇవ్వడానికి సంకోచించేవారు. పరిచర్యలో ఉన్న ఒక అన్న దేవుని ప్రేమతో, తనకి తెలిసిన కంపెనీలో జాబ్ ఇప్పించాడు. దేవుని కృప వలన జాబ్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా, ముందుకి వెళ్ళడానికి నడిపిస్తున్నాడు. వివాహ విషయములో కూడా దేవుని విశ్వసించిన భార్యని అనుగ్రహించారు. తరువాత కుమార్తెని కూడా అనుగ్రహించారు.

ఎందుకూ పనికిరాని నా జీవితమును దేవుడు కృప ద్వారా రక్షించి, ఒక కుటుంబముగా మార్చాడు. అంతేకాక మమ్ములను ఆదరించి, వాక్యము ద్వారా ధైర్యపరుస్తూ నడిపిస్తున్న దేవునికి స్తోత్రములు. చివరిశ్వాస వరకూ దేవునిలో నమ్మకంగా జీవించాలని మా కొరకు ప్రార్థన చేయండి.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

అందరూ ఆహ్వానితులే....!

**వివరములకు:**
9666666249 | 040-24202227

# విశ్వాసంలో ఎదుగుట

దేవుడు మనలో ప్రతివారికీ ఒక పరిమాణపు విశ్వాసమును లేదా విశ్వాసపు విత్తనముని ఇచ్చాడు. దేవుని వాక్యము వినడం వలన మన విశ్వాసం అధికమవుతుంది.

ఈ విషయములను మనము ఇంత వరకు అర్థము చేసుకొన్నాము. ఏ విధంగా మనము ఆ వాక్యమును వింటాము ? విని దేవుని వాక్యము అనే నేలలో విత్తనం ఏ రీతిగా ఎదగనిస్తాము ?

నీరు – దైవ వాక్కుకు లోబడడం :మొట్టమొదటిగా 'వినడం' అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. "కాగా (దేవుని మాట) వినుట వలన విశ్వాసము కలుగును" అని అపొ.పౌలు రోమా 10:7లో చెప్తున్నాడు.

బైబిల్‌లో నుండి వాక్యమును గ్రహించి చేసిన ప్రసంగమును సౌమ్యంగా వినడాన్ని గూర్చి పౌలు మాట్లాడడం లేదు. విశ్వాసం ఎదగడానికి చర్చికి వారానికి 5 సార్లు వెళ్ళమని అతడు మనకు సలహాలివ్వడం లేదు. దేవుడు మనకు చెప్పేదానిని వినడం బట్టి విశ్వాసం కలుగుతుందని పౌలు చెబుతున్నాడు. ఈ సందర్భములో వినడమంటే శబ్దాలను, మాటలను మాత్రం వినడమని కాదు. ఈ భావనను సుదూరంగా ఆలోచిస్తే, "వినడం, వినిన ప్రకారం చేయడం" అని అర్థం అవుతున్నది.

విశ్వాసం వస్తుంది, ఎదుగుతుంది, వినడం, విన్న తరువాత దాని ప్రకారం నడుచుకోవడం వలన విశ్వాసమును ప్రదర్శించి వ్యక్తపరుస్తాము. వినడం ద్వారా విశ్వాసం కలుగుతుంది అనే మాటకు "దేవుని వాక్యమును చదివి దాని ప్రకారం నడుచుకోవడం ద్వారా విశ్వాసం కలుగుతుంది" (యాకోబు 1:22) అని గ్రీకు బైబిల్‌లోని అక్షరార్థం. దేవుడు ఎప్పుడు మాట్లాడినా, అందులో విధి సహిత ఆజ్ఞ ఉంటుంది.

ఉదాహరణకు, ఒక తండ్రి తన బిడ్డలలో ఒకరికి ఇలా చెప్పవచ్చు. బాబూ, వంటగదిలో చెత్త ఉంది, దానిని తీసుకువెళ్ళి చెత్త కుండీలో పడవేయి"

అయితే ఆ పిల్లవాడు ఆటలలో పడి మర్చిపోయి 5 నిమిషాల తరువాత ఆడుకోవడానికి బయటికి పరిగెత్తి పోయాడు. ఇక ఆ వంటగదిలో ఉన్న చెత్త ఇంకా అక్కడే ఉండిపోయింది. ఆ పిల్లవాడు తన తండ్రి మాట విన్నాడా ? అతని చెవులు కొన్ని శబ్దాలను, మాటలను విన్నాయి. తాను చెప్పింది తన కొడుకు విన్నట్టు తండ్రి తలంచాడు. కాని బైబిల్ ప్రకారం అతడు వినలేదు. ఎందుకంటే తాను విన్న ప్రకారం చేయలేదు లేదా చెప్పినదానికి లోబడలేదు.

అనేకసార్లు దేవుడు మనతో మాట్లాడినప్పుడు మనం కూడా ఇలాగే చేస్తాము. దేవుడు చెప్పింది వినకుండా మనకు తోచిందే చేసుకుంటూ వెళ్తుంటాం. మనం ఏది

చేయాలనుకున్నామో దానినే చేస్తుంటాం. అంతేగాని దేవుని మాట ప్రకారం చేయము, మన విశ్వాసములో ఎదుగుదల ఎందుకు లేదా అని ఆశ్చర్యపడుతుంటాం. దాని ప్రకారంగా నడుచుకోనంత కాలం విశ్వాసం విడుదల కాదు, ఎదగదు.

ప్రతిసారీ మనం విని, ఆ మాటకు విధేయులమై నడిచినప్పుడు విశ్వాసం ఇంకొక మెట్టు ఎక్కుతుంది. దేవుని మాటకు మనం అవిధేయత చూపించిన క్షణమే మన విశ్వాసపు స్థాయి అక్కడే ఆగిపోతుంది. మనలను విశ్వాసపు అభివృద్ధిలోనికి నడిపించడానికి ముందుగా దేవుడు మనం మన మొదటి ప్రేమను ఎక్కడ వదిలిపెట్టామో, అక్కడికి వెళ్ళి, అక్కడ నుండి దానిని పరిగ్రహించి ముందుకు కొనసాగమని కోరతాడు. ఆయన ఇలా అంటున్నాడు, "నా మాట విని దాని ప్రకారము చేయువాడు ఎవడో వాడే నన్ను ప్రేమించుచున్నాడు" అంటే మన విధేయతను మించి మన విశ్వాసం పోదు, ఇది ఎవరూ మార్చలేని విశ్వాస సూత్రం.

మహిమ నుండి మహిమకు, విశ్వాసం నుండి విశ్వాసానికి మనం ఎదుగుతాము. అందుచేత మనమిప్పుడు ఎక్కడ ఉన్నా, మన దగ్గర ఏముందో దానితో ప్రారంభించాలి. మనం ఒక్క దయ్యాన్ని వెళ్ళగొట్టగలిగిన తరువాతే, దయ్యాల సమూహమును వెళ్ళగొట్టగలము. అంటే మీ విశ్వాసాభివృద్ధిని అధిగమించి ఏదీ చేయలేరు. అంటే విశ్వాసపు విత్తన స్థాయి నుండి పూర్తిగా అభివృద్ధి చెందిన విశ్వాసానికి దుమకడానికి ప్రయత్నించడమన్న మాట. అది ఆ విధంగా పనిచేయదు.

విశ్వాసమనేది మెట్లు మెట్లుగా ఎదుగుతుంది. దేవుని చిత్తమును నెరవేర్చడానికీ, అధికమైన విశ్వాస పరిధిలోనికి వెళ్ళడానికీ అపొస్తలుడైన పౌలుకు 14 సంవత్సరాలు పట్టింది (గలతీ 2:1) అతడు మిషనెరీ సేవలో ఎదుర్కొన్న సమస్యలకు, సవాళ్ళకు సమానమైన స్థాయిలో అతని విశ్వాసమును పెంచుకోవాల్సి వచ్చింది. మన విశ్వాసం ఎదిగిన కొలది మన నమ్మకం ఎదుగుతుంది.

దేవుడు మరొకరికి ఇచ్చిన మాట ప్రకారం నడుచుకోవడానికి ఎన్నడూ ప్రయత్నించవద్దు. మనము మరొక వ్యక్తి విశ్వాసమును అనుకరించలేము. గొప్ప స్వస్థతా పరిచర్యను కొందరు అనుకరించ ప్రయత్నించారు గాని దురదృష్టకరమైన దారుణ ఫలితాలను పొందారు. మరికొందరు ఇతరుల విశ్వాసపు ఎదుగుదలను అనుకరించ ప్రయత్నించి, తట్టుకోలేక అమాంతం బోర్లాపడ్డారు. అయితే ప్రభువు వాక్యము మన దగ్గరకు వచ్చినప్పుడు మనం దాని ప్రకారం నడుచుకొన్నప్పుడు కార్యములు జరుగుతాయి, జరుగగలవు.

విధేయతని అధిగమించి విశ్వాసం ఎదగదని మనం గ్రహించాలి. "వినడం వలన విశ్వాసం కలుగుతుంది" అని ఎంత వరకు గ్రహించమో, అంతవరకు మనం విశ్వాసములో ఎదగం. అంతేకాదు, దేవుడు మనతో మాటలాడిన దానికి విధేయులమై దాని ప్రకారం చేయనంత వరకూ విశ్వాసములో ఎదగం. మనం విశ్వాస విత్తనపు స్థాయి నుండి పెద్ద అంగ వేసి కొండలను కదిలించగల విశ్వాసపు స్థాయిని అందుకోవాలని దేవుడు ఎప్పుడూ కోరడు. అది ఆయన అభిమతం కూడా కాదు కాని క్రమంగా అభివృద్ధి చెందే మెట్లు ఎక్కుతూ ఎదగాలని దేవుడు కోరుతున్నట్లు మనం తెలుసుకున్నాం. ఆ రకంగా విశ్వాసం నుండి విశ్వాసానికి సాగుతూ ఉంటాం.

తాను మనకి అనుగ్రహించిన విశ్వాస పరిమాణం చొప్పున మనము ఎక్కడ ఉన్నామో, అక్కడ నుండే దేవుడు మనతో మొదలుపెడతాడు. విధేయమైన ఆత్మతో, మనకి ఇవ్వబడిన దేవుని వాక్యమును నమ్మి దాని ప్రకారం నడచుకోవాలి. అప్పుడు విశ్వాసపు విత్తనం ఆవగింజలా మనలో పెరిగి, చక్కగా ఎదిగే చెట్టులాగా అభివృద్ధి చెంది, ప్రశస్తమైన ఫలమును ఫలించడం చూస్తాము.

ప్రేమ గల దేవుడు :-

విశ్వాసం అనేది ఎదగడానికి మరొక అంశం - ప్రేమ అపో.పౌలు గలతీ 5:లో "యేసుక్రీస్తునందుండు వారికి సున్నతి పొందుట యందేమియు లేదు, పొందకపోవుట యందేమియు లేదు గాని ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" కనుక విశ్వాసం ఎదగడానికి అవసరమైనవి : వినడం, విధేయత, ప్రేమ

యోహాను 14:21లో ప్రేమ విధేయతకు గల సంబంధాన్ని యేసు ప్రస్తావించాడు. "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు" విధేయత ప్రేమకు పరీక్ష, ప్రేమకు ఋజువు. "నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమించబడును. నేనును వానిని ప్రేమించి, వానికి నన్ను కనబరచుకొందును" 23,24 వచనములలో "ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును, నన్ను ప్రేమింపని వాడు నా మాటలు గైకొనడు అని చెప్పి ముగించాడు.

మనం ఆయనను ప్రేమిస్తున్నాం గనుక ఆయన మాట విని, విన్న దాని ప్రకారం చేస్తాం. ఒకవేళ ఆయన మాటలు వినలేదంటే మనం ఆయనను ప్రేమించలేదన్న మాట. ప్రేమించకపోతే ఆ విశ్వాసం పనిచేయదు. విశ్వాసమును అభ్యాసం చేయకపోతే మన విశ్వాసం ఎదగదు. కనుక ప్రభువు మాట విని ప్రతిస్పందించిన ఫలితంగా, యేసు మీది ప్రేమ వలన, మనలో ప్రవహించే విధేయత మూలంగా విశ్వాసం పెరుగుతుంది.

సేకరించబడింది

(ఇంకా ఉంది)

# ప్రార్థనా శక్తి

## <u>సంపూర్ణ సమర్పణ</u> :-

"ప్రభువా – నీకు నన్ను నేను – సంపూర్ణముగా సమర్పించుకుంటున్నాను" అని పూర్ణ హృదయముతో చెప్పినప్పుడు మనము సంతోషించు ప్రతిదానిని మన నుండి దేవుడు తీసివేస్తారు అనుకోవద్దు. ఎందుకంటే ఆయన అది ఎప్పటికీ చేయడు – కాని సమస్తము ఆయనకు అందుబాటులో ఉండాలి. మనకు ఏది మంచిదో, ఏది మంచిది కాదో ఆయనే ఎంచవలసి యున్నది. ఆయనను సంపూర్ణముగా నమ్ముటయే మనం చేయవలసిన పని.

మనలను యేసులా తయారుచేయటమే దేవుని యొక్క ప్రాథమిక లక్ష్యమై ఉన్నది. రోమా 8:29లో "తన కుమారునితో సారూప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను" అని వ్రాయబడింది. దాని అర్థమేమిటంటే మన క్రియలలోనూ, మాటలలోనూ మరియు తలంపులలోనూ క్రీస్తులా మారుటకు కొనసాగించాలి అని ఆయన మనలను కోరుతున్నాడు. క్రీస్తులా మారుట ఒక్క రోజులో జరిగే పని కాదు. దానికి సమర్పణా ప్రక్రియ అవసరమైయున్నది. దాని అర్థం మన మానసిక, శారీరక, ఐహిక భావములు నశించవలసి ఉన్నది.

**రోమా 12:1 "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. "ఇట్టి సేవ మీకు యుక్తమైనది".** ఇది మనం దేవునికి మనలను మనం ఇచ్చుకొనుటకు ఉద్దేశ్యపూర్వకమైన నిర్ణయం తీసుకోవాలని అర్థమిస్తుంది. దేవుడు మనకు ఒక స్వేచ్ఛా చిత్తమును ఇచ్చాడు. మరియు మనం దేవునికి చెందిన వారమవ్వాలంటే, ఉన్న ఒకే ఒక మార్గం మనకు మనంగా స్వేచ్ఛగా ఆయనకు అప్పగించుటయే. తనను సేవించుటకు లేక ప్రేమించుటకు ఆయన ఎప్పటికీ ఒత్తిడి చేయడు. ఆయన మనలను నడిపిస్తాడు, ఉపదేశిస్తాడు మరియు ప్రేరేపిస్తాడు, కాని అప్పగించుకునే నిర్ణయమును మాత్రం ఎప్పుడూ మనకే వదిలిపెడతాడు. దేవుడు మనుష్యులను చేశాడు, రోబోట్‌లను కాదు, మనలను ఒక ప్రత్యేకమైన విధానములో ప్రవర్తించేటట్లుగా ఆయన చేయడు, ఎందుకంటే స్వంత నిర్ణయములు తీసుకునే స్వేచ్ఛ ఆయన మనకి ఇచ్చాడు – ఆయనను ఎంచుకోవాలని కోరుకుంటున్నాడు. ప్రతి దినము ఆయన మన జీవితములను బలిపీఠము ఎదుట పెట్టి, "దేవా నీ చిత్తము నెరవేరును గాక నా చిత్తము కాదు" అని చెప్పాలని కోరుకుంటున్నాడు. అర్థవంతంగా ప్రార్థిస్తే, ఇది మనం

చేయగలిగిన శక్తివంతమైన ప్రార్థన. ఇది క్లుప్తంగా, సులువుగా ఉంటుంది, కాని దేవుడు కోరుకునే సంపూర్ణ సమర్పణను ఇది తెలుపుతుంది. దేవుడు దేని విషయములోనైనా నీలో పని జరిగిస్తున్నట్లయితే, దానిని సమర్పించుటలో ఆలస్యం చేయవద్దు. కొద్దిరోజుల తరువాత అప్పగించుకుందాములే అని నిర్లక్ష్యం చేయవద్దు. ఎన్ని మంచి పనులు, ఉద్దేశ్యములు మనకు ఉన్ననూ, అవి విధేయతతో సమానం కాదని జ్ఞాపకం చేసుకోవలెను. మరియు ఆయన విధేయతను కోరుతున్నాడు. నిజంగా మన శరీరములను మనం దేవునికి సమర్పించుకున్నట్లైతే రోజంతా మంచంపై పడుకొని, తినుబండారాలు తింటూ, ప్రకటనలు చూస్తూ మనం సమర్పణా జీవితమును జీవిస్తున్నామని ఆలోచించము. సమర్పణా జీవితములను జీవించే క్రమములో మనం ఉదయమునే లేచి, బైబిళ్ళు తీసి, దేవునితో సమయమును గడుపుతూ ఆయనకు మనలను మనం సమర్పించుకోవాలి. మన శరీరములను దేవునికి బహుమానములుగా, ఆయన ఉపయోగించుకునే సాధనములుగా మనం చూచినపుడు మనం మన శరీరములను పాడుచేసుకోము, నిరంతరంగా వాటిని అనవసరమైన వాటితో నింపము సరైన విశ్రాంతి లేకుండా వాటిని బలహీనపరచము, దేవుని ఘనపరచు రీతులో దుస్తులు ధరిస్తాము. మనము దేవుని కనుపరచాలి కానీ లోకమును కాదన్న విషయమును జ్ఞాపకముంచుకోవాలి.

సమర్పణా ప్రక్రియ సామాన్యంగా
సౌకర్యవంతమైనది లేక సులభమైనది కాదు.
అయితే ఇది ఎల్లప్పుడూ మేలు కరమైనది దాని
ఫలితాలు అత్యద్భుతమైనవై యున్నవి.

సేకరించబడినది (జాయిస్ మేయర్)

ఇంకా ఉంది.




# బైబిల్ క్విజ్ - 35

(ఆది, నిర్గమ)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** 'మస్సా' అనగా 'మెరీబా' అనగా అర్థం ఏమిటి?

**2.** అహరోను భార్య ఎవరు?

**3.** పన్నెండు నీటి బుగ్గలను **70** ఈత చెట్లను ప్రజలు ఎక్కడ కనుగొన్నారు?

**4.** 'త్రోవలో సర్పము గాను, దారిలో కట్లపాము గాను' ఉన్నది ఎవరు?

**5.** మొదటిసారి ఇశ్రాయేలీయులు మన్నాను తిన్న స్థలం పేరు చెప్పండి?

**6.** మోషేని తల్లిదండ్రులు ఎంతకాలం దాచి పెట్టారు?

**7.** దేవుడు నిశ్చయముగా మిమ్మును చూడవచ్చును అప్పుడు మీరు నా యెముకలను ఇక్కడి నుండి తీసుకొనిపోవలెను అని చెప్పిందెవరు?

**8.** హెబ్రీయుల మగసంతానాన్ని చంపడానికి ఫరో నియమించిన మంత్రసానులు ఎవరు?

**9.** సముద్ర రేవున నివసించును అని ఎవరిని గురించి యాకోబు చెప్పాడు?

**10.** ఇశ్రాయేలీయుల కోసం ఐగుప్తీయులతో యుద్ధం చేసిందెవరు?

**ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2014 పత్రికలో ప్రచురించబడతాయి.**

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**బైబిల్ క్విజ్ - 34 జవాబులు (ఆదికాండము)**

| | |
|---|---|
| 1.జప్నత్పనేహు 41:45 | 2. బేతేలు 28:19 |
| 3. 20 తులముల వెండికి 37:28 | 4. రూబేను ఆది॥కా 49:4 |
| 5.యాకోబు 28:12 | 6. అనా 36:24 |
| 7. ఫరో 41: 1-4 | 8. యాకోబు 32:30 |
| 9. గోషేను 47:6 | 10. షిమ్యోను 42:24 |

**బైబిల్ క్విజ్ - 34 జవాబులు వ్రాసిన వారి పేర్లు :-**

కమల, విఠల్, సుశీల

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై - ఆగష్టు

**భాగ్యలత:** శారమ్మ, సంధ్యారాణి, సాంబశివరావు, నిఖిల్, రమ్య(మిర్యాలగూడ) అక్షయ, శ్రీలక్ష్మి, మాధవిలత, రమేష్, ఎస్తేరు, గోపీచంద్, రజని, సరస్వతి, ఇంద్రమ్మ, వినీత, సాత్విక్, గంగాధర్, పద్మిని, హరిబాబు, రూఫస్, గురుస్వామి, ప్రశాంత్‌వర్మ, దుర్గాప్రసాద్, రామకృష్ణ, రాజేష్, వినయ్, శ్వేత, పాపమ్మ, షర్మిల, నవీన్, శ్రావణి, బ్యూలాఅనంతలక్ష్మి, విశ్వాస్, సుగంధ్, మణెమ్మ, కిషోర్‌కుమార్, ప్రణీత, పవన్‌కుమార్, స్పర్జన్, రత్నం, సుశీల్‌చంద్ర, దుర్గ, ప్రమోద్, ప్రశాంత్, ప్రభాకర్, ప్రతిభ, ప్రసాద్, అనూరాధ, స్ప్లెండిడ్ నెహెమ్యా, అవని, సుబ్బారావు, పాల్‌వినయ్, ప్రకాష్, కీర్తి, యెషయా, షారోన్‌బాబు, రమ్యవర్మ, భానుప్రకాష్, సుజానా, దినకరన్, బ్యూలా, విజయలక్ష్మి, నాంచారమ్మ, దివ్య, తరుణి, పాపారాణి, కావ్య, మణికంఠ, రూత్‌ప్రమీలరాణి, రాజేశ్వర్రావు, హరీష్, విమలాగ్రేస్, గణేష్, జ్యోతి, పర్ణిక, జోసెఫ్, వీణ, సుశాంత్, సుభాష్, సైదులు, శిరీష, ఉన్నత్, శ్రీకాంత్, ఆశ్రయ్, రత్నకుమారి, సురేష్, రమాదేవి, శ్రీనివాసరావు, అరుణ, ప్రసన్నకుమారి, రాజశేఖర్, సంతోష్, హనీ, హోమి, నరసింహ, ఆనంద్, సత్యమ్మ, లావణ్య,హైమావతి.

**చింతల్:** ప్రశాంతి, జీవన్, గణేష్, అఖిల, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, తేజస్విని, శ్రీనివాసరావు, నాగాంజనేయులు, జస్వంత్‌రావు, షైనీ, విజయ, సుధాకర్, శిల్ప, సోనీ, సుమంత్, కార్తీక్, పరిశుద్ధరావు, రాము, సత్యం, దీపిక, కాలేబు, వీణ, నాగరాజు, శ్యామ్‌కుమార్, ప్రభాకర్, వెంకటలక్ష్మి, అజయ్‌కుమార్, శివ, దివ్య, భగవత్‌వర్మ, చిట్టెమ్మ, షీబారాణి, ఆనంద్‌బాబు, శ్రీనివాస్, అరుణ, వెంకటరమణ, నిరీక్షణ, దీవెన

**అనాజ్‌పూర్:** షాలేమురాజ్, జాన్సన్, సిద్ధు, మణి, జ్యోతి, విజయలక్ష్మి, సౌజన్య, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్, థామస్‌పీటర్.

**ఇ.సి.ఐ.యల్:** సుకుమార్, వెంకటేశ్వర్రావు, విజయ్‌కుమార్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

మీ ప్రార్థనావసరతలు:

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# బిల్లీ బ్రే



దేవుని కృపయే త్రాగుబోతు, అపవిత్ర జీవితములో ఉన్నవారిని మార్చి పరిశుద్ధ దేవుని కుమారుడైన క్రీస్తులో నిలిపి ఉంచేది. అట్టి కోవకు చెందిన వారిలో బిల్లీబ్రే ఒకరు.

బిల్లీబ్రే ఇంగ్లండు దేశములోని కార్న్‌వాల్ రాష్ట్రములో ట్వెల్వ్‌హెడ్స్ అను గ్రామములో 1794వ సం॥న జూన్ 1వ తేదీన జన్మించెను. బిల్లీ 17 సం॥ల వరకు తాతగారి గృహములో పెరిగి తరువాత పని నిమిత్తమై దూరప్రదేశమైన డెవన్‌షైన్ వెళ్ళెను. అచ్చట త్రాగుబోతుల సహవాసము పట్టి దుష్ట జీవితములోనికి దిగిపోయెను. ఇతని త్రాగుడు వలన అనేక అపాయములలో చిక్కుపడెను. అంతకంటే మరి లోతైన పాపములో దిగెను. నరక భయము చేత అనేకమార్లు "దేవా, నేనిక త్రాగను" అని తీర్మానములు చేసెను గాని, ఇంకను ఎక్కువ త్రాగెడివాడు. ఈ విధంగా 7 సం॥లు గడిచింది. వివాహమయ్యింది కానీ కుటుంబము గురించి బాధ్యత లేకుండా ఉండెను. అయితే బిల్లీ మనస్సాక్షి అతనిని దినమెల్లయు నిందించుచు, రాత్రులందు భయంకరమైన కలలతో భయపెట్టెడిది. ఇట్టి స్థితిలో అతనికి జాన్‌బన్యన్ రచించిన పరలోక దర్శనములు – నరక దర్శనములు అను పుస్తకము దొరకగా అతడు దానిని చదివెను. అప్పటి నుండి తాను మార్పు పొందవలెననే ఆశ అతనిని గట్టిగా పట్టుకొనెను. కాబట్టి వెంటనే పడక దిగి మోకాళ్ళ మీద మొదటిసారిగా ప్రార్థించెను. అప్పుడాయన మీద ప్రార్థనాత్మ దిగెను. జీవితాంతము అది అతనిని విడిచిపెట్టలేదు. మోకాళ్ళ ప్రార్థనలో గడిపి ఈ ప్రార్థనల వలన సాతానును ఓడించు శక్తిని పొందెను. 1832 వ సం॥లో బిల్లీ నూతన వ్యక్తిగా మార్పు చెందడం జరిగినది. తన తోటివారైన త్రాగుబోతుల యొద్దకు వెళ్ళి దేవుని కృపని, దేవుడు తన యెడల చేసిన గొప్ప కార్యమును చెప్పెను.

రక్షణ అనుభవము ఎంత లోతుగా ఉండునో అంతగా దేవుని శక్తి ఆ జీవితములో కనబడును. రక్షణ కొరకు బిల్లీలో కలిగిన పోరాటము సామాన్యమైనది కాదు. దాని ఫలితం పూర్ణ ఆత్మ విడుదల. బిల్లీ దేవునితో హృదయమంతటితో పెనుగులాడెను. దేవుడాయనను మహిమకరమైన జయముతో దీవించెను. ప్రసంగించు కృపను ప్రభువు బిల్లీకి ఇచ్చెను. చెప్పబడుతున్న సత్యము ప్రజలకు చక్కగా అర్థమయ్యెడిది. బిల్లీ తన హృదయమంతటితో దేవుని సేవించుటయే గాక తనకి ఉన్నదంతటిని సంతోషముగా దేవుని సేవ కొరకు వాడెను. తనకి ఉన్న కొంచెమును తనకంటే పేదలతో ఎప్పుడు పంచుకొనెడివాడు. ఇతరులకు మేలు చేయవలెనను ఆశతో నిమగ్నుడైయుండెను. దేవుని సలహాలు, హెచ్చరికలు, గద్దింపులు అందించుటకు భయపడలేదు.

1867వ సం॥నకు బిల్లీకి 74 సం॥లు నిండెను. విస్తారమైన సేవలో ఇంకను నిమగ్నుడైయుండెను. 1868వ సం॥ మే 22న ఆయన మరణించెను. చిరకాలము క్రీస్తుని సేవించిన సేవకులలో ఆయన ఒకడు. బిల్లీ సామాన్య వ్యక్తే అయినా, అతడు శ్రద్ధతో మనసంతటితో భక్తిని అవలంబించాడు. ఆయన జీవితము మనుష్యులను క్రీస్తు వైపునకు నడుపు శాశ్వతమైన జీవనజ్యోతి.

## భారతదేశంలో నేటి వరకు ప్రధానమంత్రులుగా పనిచేసిన వారి పేర్లు మరియు వారు పని చేసిన సమయం

| వ.క్ర | పేరు | | కాలం |
|---|---|---|---|
| 1. | జవహర్‌లాల్ నెహ్రూ | - | 15.08.1947 - 27.05.1964 |
| 2. | గుల్జన్ లాల్ నందా | - | 27.05.1964 - 9.06.1964 |
| 3. | లాల్ బహదూర్ శాస్త్రి | - | 9.06.1964 - 11.01.1966 |
| 4. | గుల్జన్ లాల్ నందా | - | 11.01.1966 - 24.01.1966 |
| 5. | ఇందిరా గాంధి | - | 24.01.1966 - 24.03.1977 |
| 6. | మొరార్జీ దేశాయ్ | - | 24.03.1977 - 28.07.1979 |
| 7. | చరణ్ సింగ్ | - | 28.07.1979 - 14.01.1980 |
| 8. | ఇందిరా గాంధీ | - | 14.01.1980 - 31.10.1984 |
| 9. | రాజీవ్ గాంధీ | - | 31.10.1984 - 02.12.1989 |
| 10. | విశ్వనాధ్ ప్రతాప్ సింగ్ | - | 02.12.1989 - 10.11.1990 |
| 11. | చంద్ర శేఖర్ | - | 10.11.1990 - 21.06.1991 |
| 12. | పి.వి నరసింహరావు | - | 21.06.1991 - 16.05.1996 |
| 13. | అటల్ బిహారీ వాజ్‌పేయి | - | 16.05.1996 - 01.06.1996 |
| 14. | దేవేగౌడ్ | - | 01.06.1996 - 21.04.1997 |
| 15. | అటల్ బిహారీ వాజ్‌పేయి | - | 19.03.1998 - 22.05.2004 |
| 16. | డా॥ మన్మోహన్ సింగ్ | - | 22.05.2004 - 26.05.2014 |
| 17. | నరేంద్ర మోడి | - | 26.05.2014 - ప్రస్తుతము |


ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras